www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

శుక్రవారం
29.04.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
సంపుటి - 01, సంచిక-64
పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పదం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382




# పీఎం సమీక్షకు సీఎం డుమ్మా...

## ముఖ్యమంత్రులతో ప్రధాని కరోనా రివ్యూ మీటింగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** టీఆర్ఎస్ ప్లీనరీ ఎంతో అట్టహాసంగా సాగింది. కేంద్రంపై విరుచుకుపడుతూ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 13 తీర్మానాలకు ఆమోదం తెలిపారు. అయితే.. టీఆర్ఎస్ ప్లీనరీలో పడి మోడీ సమావేశానికి కేసీఆర్ డుమ్మా కొట్టడంపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. కొద్ది రోజులు గా కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. రోజురోజుకూ కేసుల్లో పెరుగుదల కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కేసీఆర్ హాజరు కాలేదు. దీంతో బీజేపీ ఎంపీ అరవింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "మన దేశ్ కీ నేత కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ సంబురాల్లో మునిగి తేలుతూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని నిర్వహించిన కరోనా రివ్యూ మీటింగ్‌కు అత్యవసరంగా డుమ్మా కొట్టిండంట" అని ట్వీట్ చేశారు. మరోవైపు ఈ సమావేశంలో పెట్రోల్ ధరలపై మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు.

## టీఆర్ఎస్‌లో కలకలం రేపుతున్న

# ఎమ్మెల్సీ వ్యాఖ్యలు

## పోలీస్ అధికారిని దుర్భాషలాడడంపై సర్వత్రా నిరసనలు

- తనపై దుర్భాషలు ఆడినందుకే కేసు పెట్టానన్న సిఐ
- ఎలాంటి విచారణకైనా సిద్ధమన్న మహేందర్ రెడ్డి

**తాండూరు, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు పార్టీలో కలకలంరేపుతోంది. ఆయన ఓ పోలీస్ అధికారని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తనపై అసభ్య



### సారీ..మనసు నొప్పించాను

### క్షమాపణలు కోరిన ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి

*"పోలీసులపై పొరపాటున నోరు జారానని ఆయన పేర్కొన్నారు. నోరుజారిన ఆడియో క్లిప్‌లతో మనసులు నొప్పించి నందుకు విచారిస్తున్నానన్నారు. పోలీసుల మనసును నొప్పిస్తే అది బాధాకరమని ఆయన పేర్కొన్నారు. పోలీసు సోదరులంతా తన కుటుంబ సభ్యులతో సమానమని ఆయన తెలిపారు. ఆడియో క్లిప్ లతో పోలీసులు బాధపడితే తీవ్రంగా విచారిస్తున్నాను.*

పదజాలంతో దూషించారని తాండూరు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. నాకు చాలా బాధేసింది. తనపై చేసిన వ్యాఖ్యాలు పై నేను ఫిర్యాదు చేశాను. కేసు నమోదు చేశారు, ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తారు. నేను ఇసుక మాఫియాకు, రౌడీ షీటర్లకు కొమ్ము కాస్తున్నట్లు ఆరోపణలలో వాస్తవం లేదు. రౌడీ షీటర్లకు కొమ్ము కాస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై వారి పేర్లు బయట పెట్టాలి. నేను లాంగ్ లీవ్‌లో వెళ్ళినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం, నేను ఆన్ డ్యూటీలోనే ఉన్నాను అంటూ సీఐ రాజేందర్ రెడ్డి వెల్లడించారు. అయితే తాండూరు టౌన్ సీఐ రాజేందర్‌రెడ్డిని దూషించిన కేసులో 2

## ఉద్దేశ్యపూర్వకంగానే మహేందర్ రెడ్డి ఆరోపణలు

- రాజకీయంగా దెబ్బతీయాలన్న కుట్రలో భాగం
- తాండూరు టిక్కెట్ తనకే వస్తుందన్న రోహిత్
- తన వల్‌లనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని వ్యాఖ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తనపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన వివరాలు మంత్రి కెటిఆర్‌కు వివరించారు. కెటిఆర్‌ను కలసి తాజా వివాదంపై సమచారం ఇచ్చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. తానెంటో తన నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. గతంలో చాలాసార్లు ఇలాంటి వివాదాలు వచ్చాయన్నారు. విషయం సీఎం దృష్టికి, కేటీఆర్ దృష్టికి వెళ్ళిందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తాండూరు టికెట్ తనదేనని రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీసులను బూతులు తిట్టిన కేసులో తప్పు ఎవరిదో త్వరలో తేలుతుందన్నారు. తాను రౌడీ షీటర్లను పెంచి పోషిస్తున్నాననడం అవాస్తవమన్నారు. దమ్ముంటే మహేందర్ రెడ్డి నిరూపించాలన్నారు. ఇసుక అక్రమ రవాణా చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఎవరు చేస్తున్నారో స్థానిక ప్రజలకు తెలుసన్నారు. మొత్తంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డితో తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఢీ అంటే ఢీ అంటున్నారు. అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని, రాబోయే ఎన్నికల్లోనూ తాండూరు టిక్కెట్ తనదేనంటూ కుండబద్దలు కొట్టారు. ప్రస్టేషన్ లో ఉన్న పట్నం మహేందర్ రెడ్డి.. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. పోలీసు ఉన్నతాధికారులపై నోరు 2

# మన ఓట్లు మనకే.. ఆర్ఎస్ పిలుపు!



**ఖమ్మం, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** ఆధిపత్య పార్టీలకు ఓట్లు వేస్తే.. అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని మార్చి బహుజనుల అస్తిత్వాన్ని ప్రమాదంలో పడేసే ప్రయత్నాలు చేస్తారని ఆరోపించారు బీఎస్పీ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో 43వ రోజు బహుజన రాజ్యాధికార యాత్రను ఆయన కొనసాగించారు. ఈ 2

# 29న ప్రభుత్వ ఇఫ్తార్ విందు

### ఎల్‌బి స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** రంజాన్ సందర్భంగా ఈనెల 29న ముస్లింలకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్టు పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈమేరకు ఎల్బిస్టేడియంలో పెద్దయెత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంత్రి తలసానితో పాటు హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ముస్లీంలు నెలరోజుల పాటు ఉపవాస దీక్ష చేస్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నిమతాల పండగలను ప్రభుత్వం నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేస్తున్నట్టు మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్నామని 2

# గురుకుల కాలేజీలో దారుణం



**హైదరాబాద్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** గాఢనిద్రలో ఉన్న ఇంటర్ విద్యార్థి గొంతుకోసిన ఘటన గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలిలా ఉన్నాయి. కళాశాలలో సాయంత్రం అల్పాహారం వడ్డించే సమయంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి సాత్విక్ (16) లైన్‌లో ఉన్నాడు. రెండో సంవత్సరం విద్యార్థి సేమియా వడ్డిస్తుండగా సాత్విక్ చేతిపై పడటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం వడ్డించిన విద్యార్థి.. ఈ విషయాన్ని తన స్నేహితుడికి చెప్పగా, అతడు సాత్విక్‌పై చేయిచేసుకున్నాడు. దీంతో టీచర్లు ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత.. రాత్రి హాస్టల్‌లో 2

# నల్లగొండకు సిఎం వరాల జల్లు

- నుడా పై అధికారులతో సిఎం సమీక్ష
- పలు కార్యక్రమాల ప్రకటన

**నల్లగొండ, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** నల్లగొండ పై ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి వరాల జల్లు కురిపించారు. నల్లగొండ మున్సిపాలిటీని ఆధునికరించేందుకు గాను నుడా నల్లగొండ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ గా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు మరిన్ని వరాలు ప్రకటించారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తండ్రి దివంగత నర్సింహ 2



# గుణాత్మక పాలన అంటే కుటుంబ పాలనా..!

- సర్జికల్ స్ట్రయిక్స్ ప్రూఫ్‌లు అడిగే వ్యక్తికి దేశ సమగ్రత తెలుసా
- 8 ఏళ్లుగా తెలంగాణలో ఏం ఉద్దరించారో చెప్పాలి
- సిఎం కెసిఆర్ విమర్శలపై ఘాటుగా స్పందించిన కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** బీజేపీ అంటే టిఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబం భయపడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబీకుల మాటలు, తీర్మానాలు అభూత కల్పనలని ఆయన విమర్శించారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ దేశాన్ని ఉద్ధరించేది టీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబమే అని మాట్లాడుతున్నారని, తెలంగాణలో 8 2

# రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం

- లైఫ్ సైన్సెస్ రంగంలో 100 బిలియన్ డాలర్ల సాధనే లక్ష్యం
- థర్మో ఫిషర్స్ సెంటర్‌ను ప్రారంభిచిన మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నా మని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణలో పెట్టుబడుకలు అనేకులు ఆకర్శితులై వస్తున్నారని అన్నారు. 2030 లోపు లైఫ్ సైన్సెస్ రంగంలో 100 బిలియన్ డాలర్ల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో థర్మో ఫిషర్స్ ఇండియా ఇంజినీరింగ్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. లైఫ్ సైన్సెస్‌లో డేటా సైన్స్ కలుస్తుందన్నారు. థర్మో ఫిషర్స్ పరిశోధన, అభివృద్ధి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. 15 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఈ సంస్థ ఏర్పడుతున్నదని చెప్పారు. దీంతో నైపుణ్యం కలిగిన 450 మందికిపైగా ఇంజినీర్లు పనిచేస్తారన్నారు. థర్మో ఫిషర్స్ కొత్త ఉత్పత్తులు, విశ్లేషణాత్మక పరిష్కారాలకు కేంద్రంగా ఉండనుందని చెప్పారు. ఈ సంస్థ పరిశోధన కోసం ఏటా 1.4 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని వెల్లడించారు. ఈ సంస్థ ఇప్పటికే ఉత్పత్తి, భూ, నీటి వనరులపై పరిశోధన చేస్తున్నదని తెలిపారు. గత నెలలో బోస్టన్‌లో థర్మో ఫిషర్స్ ప్రతినిధులను కలిశానని గుర్తుచేశారు. పరిశోధన కేంద్రాల విషయంలో ఆసియాలోనే క్రియాశీలక స్థానంలో ఉన్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. నైపుణ్యం, సామర్థ్యం విషయంలోనూ హైదరాబాద్‌ది ప్రత్యేక స్థానమని చెప్పారు. నగరంలో ఇప్పటికే ఐడీపీఎల్, ఇక్రిశాట్, సీఎస్ఐఆర్ వంటి ఎన్నో పరిశోధన కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్లోబల్ కేపబిలిటి సెంటర్లకు కూడా హైదరాబాద్ మంచి ప్రదేశమని వెల్లడించారు.

# రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పుకునే ధైర్యమేదీ ?

- కేంద్రాన్ని, బిజెపిని విమర్శించడానికే ప్లీనరీ
- తెరాస పతనం ప్రారంభం అయ్యిందన్న బండి



**నారాయణపేట, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** కేంద్రాన్ని తిట్టడానికి, భాజపాను విమర్శించడానికే తెరాస ప్లీనరీ సమావేశాలు నిర్వహించిందని, ప్లీనరీ తీర్మానాల వల్ల దేశానికి, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. తెరాస పాలనలో ఆ పార్టీ ఏం చేసిందో, ఏం చేయబోతుందో చెప్పుకోలేక పోయిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలకే ఏమీ చేయలేని ముఖ్యమంత్రి దేశానికి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కాకపోతే.. అంతర్జాతీయ రాష్ట్ర సమితి పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తెరాస పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టడానికి, భాజపాను విమర్శించడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే తెరాస ప్లీనరీ సమావేశాలు నిర్వహించిందని సంజయ్ విమర్శించారు. 8ఏళ్ల పాలనలో తెరాస ఏం చేసిందో, భవిష్యత్తులో ఏం చేయబోతుందో చెప్పకుండా భాజపా లక్ష్యంగానే ప్లీనరీ సమావేశాలు నడిచాయని అన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూరులో పాదయాత్ర శిబిరంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఏం చేసిందో చెప్పుకోలేని పరిస్థితికి తెరాస చేరుకుందని, రాష్ట్రంలో తెరాస పతనం ప్రారంభమైందని అభిప్రాయపడ్డారు. రెండోదశ ప్రజా సంగ్రామ యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి తెరాసకు భాజపా భయం పట్టుకుందన్నారు. తాను సంధించిన 21 ప్రశ్నలకు 2

# డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల వల్లనే గ్రోత్

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- అసోం పర్యటనలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి కోసం చేపట్టిన అనేక చర్యలను వివరిస్తూ, ఇదంతా డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల ఘనత అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అస్సాంలోని కర్బి అంగ్‌లాంగ్ జిల్లాలో వివిధ ఆరోగ్య సంరక్షణ, విద్యా సంబంధిత ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వాలు ఏర్పడటం వల్లనే అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల వల్ల ఉపయోగం ఉందన్నారు. కర్బి అంగ్‌లాంగ్‌లోని డిఫులో 'శాంతి, ఐక్యత, అభివృద్ధి సభ' పేరుతో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిస్థితులు మెరుగుపడినందువల్ల సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) అమలును అస్సాంలోని 23 జిల్లాల్లో, ఈ 2

## సంపాదకీయం

# పెట్రో ధరలపై మోడీ నాటకాలు !

ప్రధానమంత్రి వీడియోకాన్ఫరెన్స్ ఓ డ్రామా కాన్ఫరెన్స్..తెలంగాణ సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు నిజంగానే సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. పనేం లేదు.. ఫలితం ఏం లేదు. మూడు గంటలు నాలుగు గంటలు ముఖ్యమంత్రులంతా కూర్చొని ఉండాలే. వాళ్లంతా చెప్పేది వినాలే. కరోనా మళ్లీ వస్తున్నది.. దాని కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలు పెట్టాలని సమావేశం... కానీ సమావేశంలో మాట్లాడింది మాత్రం ... రాష్ట్రాలు ట్యాక్సులు తగ్గించాలి. కనీసం చెప్పడానికి సిగ్గు ..ఎగ్గన్న ఉండాలి కదా. ప్రజల మీద భారం వేయవద్దంటే మీరెందుకు పెంచుతున్నరు మోదీ గారు నేడు డైరెక్ట్‌గా అడుగుతున్న అంటూ కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై ప్రజలంతా ఆలోచన చేయాలి. నిజంగానే ప్రజలమీద ప్రేమ ఉంటే నువ్వు ఎందుకు పెంచినవ్ అని ప్రధాని మోడీని సూటిగానే ప్రశ్నించారు. నిజానికి ప్రజల నుంచి డబ్బులు గుంజడమెలా అన్నది కేంద్రం చేస్తున్న ఆలోచన.. జిఎస్టీతో ప్రజలు అల్లాడుతున్నా..పన్నులు కట్టలేక చస్తున్నా..పెట్రోల్ ధరలతో దాడులు చేస్తున్నా.. పట్టించుకోని ప్రధాని మోడీ రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలని సిఎంలతో జరిగిన కాన్ఫరెన్స్‌లో చేసిన సూచనలు ప్రజలంతా గమనిస్తున్నారు. మోడీ వచ్చాక వివిధ రూపాల్లో జిఎస్టీ వసూల్లు లక్షల కోట్లలో పెంచుకుంటున్నారు. కానీ ప్రజలపై పడుతున్న భారాలపై మాట్లాడడం లేదు. 2015లో అప్పుడున్న ఆర్థిక శాఖ కార్యదర్శి చెబితే ధరలను సరి చేయడానికి రౌండప్ చేయడానికి ఒకసారి సవరించారు తప్ప.. ఈ రోజు వరకు పెట్రోల్, డీజిల్ మీద ఒక పైసా కూడా టాక్స్ పెంచలేదని సిఎం కెసిఆర్ కుండబద్దలు కొట్టారు. నిజానికి మోడీ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఏ అంశంపైనా చర్చించడం లేదు. నిజానికి విజన్ ఉన్న ప్రధానిగా..అంతా బ్రహ్మాండంగా చేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రధానిగా దేశానికి ఒరిగిందేమిటన్న ఆలోచనచేయడం లేదు. ప్రజలను విస్మరించి చేస్తున్న పాలన కారణంగా ప్రజలు నానా యాతన పడుతున్నారు. పెట్రో ధరల పాపాన్ని రాష్ట్రాలపైకి నెట్టాలన్న దుష్ట ఆలోచనలో ప్రధాని మోడీ ఉన్నట్లుగా సిఎంల కాన్ఫరెన్స్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు ఉన్నాయి. అందుకే అన్ని పక్షాలు మోడీ తీరును తూర్పారా బట్టాయి. పెట్రో ధరలు తగ్గించాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్రమోడీ విజ్ఞప్తి చేయడంపై కాంగ్రెస్ ఘాటుగానే స్పందించింది. ఎందుకంటే కాంగ్రెస్ హయాంలో పెట్రో ధరలపై మోడీ కూడా విమర్శలు చేసిన విషయం ప్రజలకు గుర్తుండే ఉంటుంది. నిజానికి కేంద్రం ముందుగా ఎక్సైజ్ డ్యూటీ తగ్గించి ఆ తర్వాత వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలకు చెప్పివుంటే మోడీ నిజాయితీగా ఉన్నాడని అనుకునే వారం. మోడీ అధికారంలోకి వచ్చాక లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.18 కిపైగా పెంచారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా కూడా చెప్పారు. యూపీఏ హయాంలో లీటర్ పెట్రోల్‌పై రూ.9.84 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. మోడీ దాన్ని రూ.27.90కు, లీటర్ డీజిల్‌పై రూ.3.56గా ఉన్న సుంకాన్ని రూ.21.80కు పెంచారని మండిపడ్డారు. వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను కోరే ముందు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని సుర్జేవాలా సూచించారు. ఇదిలా ఉంటే సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో లక్షల కోట్లు ఆదాయం వస్తున్న విషయాన్ని ప్రధాని ఎందుకు దాస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ప్రశ్నించారు. ఎక్సైజ్ సుంకం ద్వారా కేంద్రానికి రూ.26 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన విషయాన్ని ప్రధాని ఎందుకు ప్రస్తావించడంలేదని అన్నారు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాల వాటాను సకాలంలో చెల్లించని కేంద్రం ఇప్పుడు వ్యాట్ తగ్గించాలని ఎందుకు అడుగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోడీ తొలుత ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి ఆ తర్వాత రాష్ట్రాలను వ్యాట్ తగ్గించాలని చెప్పితే బాగుండేది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, అక్కడి ప్రభుత్వాలు విలువ ఆధారిత పన్ను(వ్యాట్) తగ్గించకపోవడమే ఇందుకు కారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడుతున్నారు. ఓ రకంగా పెట్రో ధరలపై రాష్ట్రాలను అప్రతిష్ట పాటు చేయాలన్న ఆలోచనగా ఉంది. సామాన్య ప్రజలకు ఊరట కలిగించడానికి, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించాలని కోరడంలో ఔచిత్యం ఇదే అయి ఉంటుంది. పెట్రో ధరలపై ప్రధాని అవాస్తవాలు చెబుతున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బెంగాల్ సిఎం మమతా బెనర్జీకూడా ఆరోపించారు. కరోనాపై సమీక్షించడానికి నిర్వహించిన వర్చువల్ భేటీలో ప్రధానమంత్రి పెట్రోల్ ధరలపై మాట్లాడడం ఏమిటని మమత ఆక్షేపించారు. ఈ భేటీలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు తాము బాధ్యత వహించబోమని మహాసిఎం ఉద్ధవ్ థాక్రే అన్నారు. కేంద్రానికి ప్రత్యక్ష పన్నుల్లో 38.3 శాతం, జీఎస్టీ వసూళ్లలో 15 శాతం మహారాష్ట్ర నుంచే వస్తున్నాయని తెలిపారు. తమ వాటా కింద రూ.26,500 కోట్లు రావాల్సి ఉన్నప్పటికీ కేంద్రం ఇవ్వడం లేదని మండిపడ్డారు. నిజానికి చమురు కంపెనీలు గనుక ఈ విధంగా ధరలను పెంచినట్లైతే, అది అక్కడితో ఆగిపోదు. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అనేక వస్తువుల ధరలు దాని ఫలితంగా పెరుగుతాయి. అప్పుడు ప్రభుత్వం కూడా తన వ్యయాన్ని ఆ మేరకు పెంచవలసి వుంటుంది. ఆ విధంగా అదనపు వ్యయం చేయాలంటే అందుకోసం ప్రభుత్వం తన ఆదాయాన్నీ పెంచుకోవాలి, అందుకు ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల మీద తనకు వచ్చే పన్ను ఆదాయాన్ని పెంచుకోవాలి. ప్రభుత్వం మాదిరిగానే పెట్రో ఉత్పత్తులను వినియోగించే ప్రతీ సంస్థ ఆర్‌టిసి, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలువంటివి కూడా తమ సేవల రేట్లు పెంచవలసి వుంటుంది. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. ఇంతటితోనే ఇది ఆగదని, రాబోయే రోజుల్లో ఇదే విధమైన వడ్డింపులు మరిన్ని రానున్నాయని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటు కంపెనీలూ చమురు పెరుగుదల భారాన్ని భరించడానికి సిద్ధంగా లేవు. ఇటు ప్రభుత్వమూ పెరిగే ధరల ద్వారా తనకు లభించే అదనపు ఆదాయాన్ని వదులుకోడానికి సిద్ధంగా లేదు. భారమంతా వినియోగదారులపైనే పడేయడం ద్వారాచేతులు దులుపుకోవాలన్న ధోరణిలో పాలకులు ఉన్నారు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## మన ఓట్లు మనకే.. ఆర్ఎస్ పిలుపు!

(మొదటి పేజీ తరువాయి..) సందర్భంగా వల్లభి, సూరంపల్లి, మల్లారం, కమలాపురం, పమ్మిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అమలుకాని హామీలను నమ్మి ఓట్లు వేస్తే విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, సంపదను పేద వర్గాలకు దూరం చేశారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మన ఓట్లు మనమే వేసుకుని రాష్ట్రాన్ని ఏలుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు ఆర్ఎస్ ప్రవీణ్. కుటుంబ పాలనతో బహుజనులను బానిసలుగా మార్చారని మండిపడ్డారు. మల్లారంలో బీఎస్పీ జెండా దిమ్మె కూల్చిన సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి బొగ్గు గనుల తవ్వకాలు, గనుల లీజు, సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో కాంట్రాక్టర్లు ఆధిపత్య కులాలకు చెందినవారే ఉన్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు అవకాశాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన కేసీఆర్.. దళిత బంధు పథకంతో మరో మోసానికి తెర తీశారని ఆరోపించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ అనుచరులు, బంధువులకు లక్షల రూపాయల ప్రజా ధనాన్ని కొల్లగొట్టడానికి దళిత బంధు ప్రవేశపెట్టారని విరుచుకుపడ్డారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుతున్న సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ అవకాశాలతో పాటు అన్ని రంగాలను అభివృద్ధి చేయడమే బీఎస్పీ లక్ష్యమని చెప్పారు.

## గుణాత్మక పాలన అంటే కుటుంబ పాలనా..!

(మొదటి పేజీ తరువాయి..)ఏళ్లుగా టీఆర్ఎస్ ఏం ఉద్ధరించిందో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఫెడరల్ ఫ్రంట్, థర్డ్ ఫ్రంట్, గుణాత్మక మార్పు అని కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. గుణాత్మకమైన పరిపాలన అంటే..కుటుంబ పాలనా? అని ప్రశ్నించారు. పుల్వామా సర్జికల్ స్ట్రయిక్స్ ఆధారాలు కోరిన వ్యక్తి దేశ సమగ్రత గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. గుణాత్మకమైన పరిపాలన అంటే ఏంటనేదానికి అర్థం చెబుతూ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. కల్వకుంట్ల కుటుంబానికి ఎలాంటి పదవులు ఉన్నా తమకు అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. ఫ్రంట్‌లు, టెంట్‌లు పెట్టుకోవచ్చని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కుటుంబానికి ఎలాంటి పదవులు ఉన్నా.. భాజపాకు అభ్యంతరం లేదని చురకలంటించారు. గుణాత్మకమైన పరిపాలన అంటే... కేసీఆర్ కుటుంబ పాలననా అని ప్రశ్నించారు. గుణాత్మకమైన పరిపాలన అంటే అవినీతీ పాలననా? అంటూ విమర్శలు చేశారు. కేసీఆర్ ఎనిమిదేళ్లు తెలంగాణను ఉద్ధరించినట్లు మాట్లాడుతున్నారన్న ఆయన... గుణాత్మకమైన పరిపాలన అంటే కల్వకుంట్ల కుటుంబపాలననా అని నిలదీశారు. గుణాత్మకమైన పరిపాలన అంటే కేసీఆర్ అవినీతి పాలనా? గుణాత్మకమైన పరిపాలన అంటే అహంకారపూరితమైన పాలనా? గుణాత్మకమైన పరిపాలన అంటే ఏ ఎండకు ఆ గొడుగు పట్టే అవకాశవాదన పాలననా? గుణాత్మకమైన పరిపాలన అంటే అప్పులు చేసే పాలనా? గుణాత్మకమైన పరిపాలన అంటే అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాసేపాలననా? గుణాత్మకమైన పరిపాలన అంటే ఆఫీసు రాని పాలనా? గుణాత్మకమైన పరిపాలన అంటే నిజాం రాజ్యంలాంటి పాలననా? గుణాత్మకమైన పరిపాలన అంటే తండ్రి, కుమారుల పాలననా?అంటూ విమర్శలు సంధించారు.

## టీఆర్ఎస్‌లో కలకలం రేపుతున్న ఎమ్మెల్సీ వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి..) టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఆ ఆడియో తనది కాదని... ఈ విషయంలో కోర్టులో తేల్చుకుంటానని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇదంతా ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి చేయిస్తున్నారని ఆరోపించారు. పోలీసులను నోటీసు ఇవ్వమ నండి... విచారణను ఎదుర్కొంటా అని తెలిపారు. రోహిత్ రెడ్డి తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్సీ మండిపడ్డారు. తాండూరు పట్టణంలో జరిగిన భావిగి భద్రేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమంలో తన ముందు రౌడీ షీటర్లు వచ్చి ఇబ్బంది పెట్టే పరిస్థితి వచ్చిందని, అక్కడికి ఇద్దరు రౌడీ షీటర్లు వచ్చారని తెలిపారు. ఈ విషయంలో రూరల్, టౌన్ సీఐతో మాట్లాడినట్లు చెప్పారు. పోలీసులు అంటే తనకు గౌరవం ఉందన్నారు. అధికారులు అంతా తాండూరు రావాలని కోరుకుంటారని అన్నారు. పోలీసులతో చాలా బాగుంటానని పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ఫోన్ లో బండ బూతులు తిట్టడంతో మనస్తాపం చెందిన తాండూరు సీఐ రాజేందర్ రెడ్డి రెండు రోజులుగా ఉన్నతాధికారులకు అందుబాటులో లేరు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. సీఐ ఫిర్యాదుతో ఎమ్మెల్సీపై తాండూర్ టౌన్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఎమ్మెల్సీ కామెంట్స్ పై పోలీస్ అధికారుల సంఘం కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. జాతర సందర్భంగా జరిగిన వ్యవహారంలో బుధవారం సీఐకి మహేందర్‌రెడ్డి ఫోన్ చేసి బండ బూతులు తిట్టారు. దమ్ముంటే కేసు పెట్టుకో అంటూ సవాల్ చేశారు. ఆ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో సీఐ తాను డ్యూటీ చేస్తున్న స్టేషన్‌లోనే పట్నం మహేందర్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీపై 353, 504, 506 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎమ్మెల్సీ తీరును పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి ఖండించారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహేందర్ రెడ్డి తీరును ఖండిస్తూ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి మద్దతుదారులు బుధవారం రాత్రి తాండూరులో ఆందోళనలు చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన పైలట్ రోహిత్ రెడ్డి చేతిలో పట్నం మహేందర్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పైలెట్ రోహిత్ రెడ్డి అధికార టీఆర్ ఎస్ లో చేరారు. అప్పటి నుంచి ఈ ఇద్దరు నేతల మధ్య వర్గ పోరు నెలకొంది.

## ఉద్దేశ్యపూర్వకంగానే మహేందర్ రెడ్డి ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి..)పారేసుకోవడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. పట్నం మహేందర్ రెడ్డి కామెంట్స్‌కు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. తాండూరు నియోజకవర్గం ప్రజలందరూ తన పని తీరు పట్ల చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి తాండూరులో చాలా అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ తనకే దక్కుతుందని పైలెట్ రోహిత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిట్టింగులకే ఎమ్మెల్యే టిక్కెట్లు ఇస్తామని గతంలో మంత్రి కేటీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సర్వేలలో తనకే పాజిటివ్ రెస్పాన్స్ ఉన్నప్పుడు పట్నం మహేందర్ రెడ్డి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించడం ఎంత వరకు కరెక్టని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎప్పటి నుంచో పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయించానని.. టీఆర్ఎస్ అధిష్టానానికి కావాల్సింది గెలుపు గుర్రాలని మహేందర్‌రెడ్డికి చురకలంటిం చారు. నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల సీఎం కేసీఆర్ తనను ఎన్నోసార్లు అభినందించిన విషయాన్ని పైలెట్ ప్రస్తావించారు. నియోజకవర్గంలో గొడవలు చేస్తుంది ఎవరో ప్రజలకు తెలుసని పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. పోలీసు అధికారులపై నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదని, బూతు పదాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఫ్రస్టేషన్ లో తనపై ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని.. ఈ అంశాన్ని త్వరలోనే అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలో ఏ ఒక్క సర్పంచ్ ను వేధించలేదని, సీఐను తిట్టిన అంశాన్ని పక్కదారి పట్టించేందుకే పట్నం మహేందర్ రెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. శనివారం తాండూరులో భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో తన పక్కన రౌడీషీటర్లు ఎవరూ లేరన్నారు. తాండూరు అభివృద్ధే తన లక్ష్యమని చెప్పిన పైలెట్ పట్నం మహేందర్ రెడ్డి పార్టీ మారే విషయం తనకు తెలియదని చెప్పారు. తమ మధ్య ఉన్న విభేదాలపై గతంలోనే చాలాసార్లు జిల్లా మంత్రి సమక్షంలో చర్చలు జరిగాయని రోహిత్ రెడ్డి చెప్పారు. మహేందర్ రెడ్డి తన ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సీఐను తిట్టలేదని ఎమ్మెల్సీ చెప్పిన మాటల్లో నిజం లేదని, విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. తాండూరులో తనకు ఎలాంటి వ్యాపారాలు లేవని, హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయని పైలెట్ స్పష్టం చేశారు.

## రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పుకునే ధైర్యమేదీ ?

(మొదటి పేజీ తరువాయి..) ముఖ్యమంత్రి సమాధానమే ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్లీనరీ తీర్మానాలు చూసి తెరాస నేతలే నవ్వుకుంటున్నారని, ఆ తీర్మానాల వల్ల రాష్ట్రానికి, దేశానికి ఎలాంటి ప్రయోజనం లేదని అభిప్రాయపడ్డారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేసిన కేసీయార్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను అప్పులపాలు చేసింది కేసీయార్ కాదా అని ప్రశ్నించారు. మోదీ విధానాల్ని ఇతర దేశాల అధినేతలు ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. తెరాసకు తెలంగాణ వీఆర్ఎస్ ఇచ్చిందని, బీఆర్ఎస్ కాకపోతే,, అంతర్జాతీయ రాష్ట్ర సమితి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఈఎస్ఐ, సహారా కుంభకోణాలు వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌పై అభిమానం ఒలకబోసిన ముఖ్యమంత్రి ..ఆయనపై చెప్పులేసిన వాళ్లలో కేసీఆర్ లేరా చెప్పాలన్నారు. కమ్మ సామాజిక వర్గాన్ని నమ్మించడానికే తప్ప ఎన్టీఆర్ పై ప్రేమతో కాదన్నారు. పార్టీ ఆస్తులు వెయ్యి కోట్లని ప్రకటించిన ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ ఆస్తులు ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. భాజపా మతతత్వ పార్టీ అన్న కేసీఆర్ విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. దేశానికే ఎంఐఎం పార్టీ క్యాన్సర్ లాంటిదని, అలాంటి క్యాన్సర్ గొంతులో వేసుకున్నది ముఖ్యమంత్రేనని ఎదురుదాడికి దిగారు. ఎంఐఎం మతపార్టీ కాదా అని ప్రశ్నించారు. అవకాశమిస్తే కేసీఆర్ ముస్లింలకు 20శాతం రిజర్వేషన్లు కూడా అమలు చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్- తెరాస ఒకటేనన్న సంజయ్.. కాదని చెప్పినా జనం నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. భాజపాను ఒంటరిగా ఎదుర్కోలేక భాజపాయేతర పక్షాలు ఒక్కటవుతున్నాయని, ఎన్ని కూటములు ఏర్పడినా..తెలంగాణలో భాజపాదే అధికారమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల గురించి మాట్లాడిన ముఖ్యమంత్రి పోయిన మంత్రివర్గంలో ఎంతమంది మహిళలకు పదవులిచ్చారో చెప్పాలన్నారు. మహిళా గవర్నర్‌కు రాష్ట్రంలో కనీస గౌరవం దక్కడం లేదన్నారు. తెరాస పాలనలో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని, రజాకార్ల సమయంలోని ఆఘాయిత్యాలు తెరాస పాలనలో చూస్తున్నామన్నారు. కేంద్రంలో 27 మంది బీసీలకు మోదీ మంత్రి పదవులిచ్చారని, ప్రధాని మోదీ, తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు బీసీలని తెరాస పాలనలో బీసీలకు ఎన్ని మంత్రి పదవులు దక్కాయో చెప్పాలన్నారు. 60వేల కోట్ల ఎరువులపై రాయితీ ఇచ్చి తక్కువ ధరకు రైతులకు ఎరువులు ఇస్తున్న ప్రభుత్వం భాజపా ప్రభుత్వమని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరపై వ్యాట్ తగ్గించకుండా కేంద్రాన్ని తప్పుపట్టడమేంటన్నారు. పాలమూరులో వలసలు లేవన్న కేసీఆర్ అక్కడికి రావాలని, నారాయణపేట నుంచి ముంబయికి వెళ్లే బస్సు ఎక్కిస్తానన్నారు. ధాన్యం కొనుగోలు చేస్తున్నది కేంద్రం అయితే కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ తీర్మానం చేయడమేంటని ఎద్దేవా చేశారు. కేంద్ర పంచాయతీ రాజ్ ప్రకటించిన ఉత్తమ గ్రామాల్లో 20కి 19 తెలంగాణవే ఉన్నాయని గొప్పులు పోతున్న మంత్రులు.. ఆ గ్రామాలకు తెలంగాణ ప్రభుత్వం ఎన్ని నిధులు విడుదల చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఆ గ్రామాలు అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. తక్షణం రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్లీనరీల్లో హామీలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారు. తెరాస ప్లీనరీలో మాత్రం కేంద్రం, భాజపానే లక్ష్యంగా చేసుకున్నారు. ప్లీనరీలో భాజపా నేతలను అసభ్య పదజాలంతో దూషించారు. ప్రజాసంగ్రామ యాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తెరాస నేతలు గందరగోళం చేశారు. రూ.4 లక్షల కోట్ల అప్పులున్న తెలంగాణ ధనిక రాష్ట్రమా. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి కేసీఆర్ కుటుంబం సంపాదించుకుందని బండి సంజయ్ విమర్శించారు.

## డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల వల్లనే గ్రోత్

(మొదటి పేజీ తరువాయి..) ప్రాంతంలోని మరికొన్ని ప్రాంతాల్లో రద్దు చేసినట్లు తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో'అందరితో కలిసి, అందరి అభివృద్ధి, అందరి నమ్మకం, అందరి కృషి' స్ఫూర్తితో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇదే స్ఫూర్తితో సరిహద్దుల సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని చెప్పారు. ఇటీవల అస్సాం-మేఘాలయ మధ్య కుదిరిన ఒప్పందం ఇతరులను కూడా ప్రోత్సహిస్తుందన్నారు. శాంతి, అభివృద్ధి కోసం గత ఏడాది కర్బి అంగ్‌లాంగ్ నుంచి అనేక సంస్థలు దృఢ నిశ్చయంతో ముందుకు వచ్చాయని చెప్పారు. బోడో ఒప్పందం 2020లో శాశ్వత శాంతికి నూతన ద్వారాలను తెరిచిందన్నారు. స్పాంలోని డిఫులో వెటరినరీ కళాశాలకు, వెస్ట్ కర్బి అంగ్‌లాంగ్‌లో డిగ్రీ కళాశాలకు, కోలోంగలో వ్యవసాయ కళాశాలకు మోదీ గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చిరుమర్తికి కెసిఆర్ పరామర్శ

**నల్లగొండ, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** నార్కట్‌పల్లి టీఆర్ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. లింగయ్య తండ్రి చిరుమర్తి నరసింహ ఇటీవలే మరణించిన సంగతి తెలిసిందే. గురువారం నరసింహ సంతాప వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. నరసింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, జగదీశ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా నివాళులర్పించారు.



## తెలంగాణలో ఏం సాధించారని ప్లీనరీలు

- ఇక్కడ చేతగాదు గాని దేశం బాగు చేస్తాడట
- విద్యవైద్యం పూర్తిగా భ్రష్టు పట్టించారు
- ఫామ్‌హౌజ్ కోసమే కాళేశ్వరం నిర్మాణం
- లక్షరూపాయల రుణమాఫీని అటకెక్కించారు
- కౌలురైతుకు రైతుబంధును అందించాలి
- భట్టి పాదయాత్ర రాష్ట్రమంతా కొనసాగాలి
- మెడిసిన్ విద్యార్థి అనూష చదువు ఖర్చులు భరిస్తా
- మీడియా సమావేశంలో ఎంపి కోమటిరెడ్డి వెంకటర్ రెడ్డి



**నల్గొండ, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఏం సాధించారని ఇప్పుడు దేశాన్ని బాగు చేస్తానంటూ మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారని ప్లీనరీ పేరుతో ఉత్సవాలు చేసుకున్నారని కేసీఆర్ పై మండిపడ్డారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన టీఆర్ఎస్ ప్లీనరీ గురించి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్లీనరీ పేరుతో వందల కోట్ల ప్రజా ధనాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ద్వారా తన ఫాం హౌజ్ కు నీళ్లు తెచ్చుకున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు. నార్కట్ పల్లిలోని బ్రాహ్మణవెల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టను ఎప్పుడు పూర్తి చేస్తారని అడిగారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లాకే కేసీఆర్ సీఎం అయినట్లు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. లక్ష రూపాయల రుణమాఫీ ఏకకాలంలో చేస్తానన్నా కేసీఆర్... ఇప్పటివరకు ఒక్కరికి కూడా రుణమాఫీ చేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో విద్య, వైద్యం భ్రష్టుపట్టిందన్న ఆయన... నోటిఫికేషన్ల పేరుతో కేసీఆర్ హడావుడి చేస్తున్నారన్నారు. ధరణి పేరుతో రైతులను దోచుకున్నారని చెప్పిన ఆయన... తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని ఎత్తేస్తామన్నారు. ధరణి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణి ఎత్తివేస్తామని ఎంపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏం అభివృద్ధి చేశారని దేశం గూరించి సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్టీ పొత్తు అడిగినా ఏఐసీసీ హైకమాండ్ ఒప్పుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. కౌలు రైతులకు రైతుబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రో చార్జీలు పెంచుతూ మోడీ, కేసీఆర్ ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నారని, ధర్నాల పేరుతో ఒకరినొకరు దూషించుకుంటూ... కేసీఆర్, బీజేపీ నాయకులు డ్రామాలాడుతున్నారన్నారు. పట్నం మహేందర్ రెడ్డి ఎపిసోడ్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. పట్నం మహేందర్ రెడ్డికి కోమటిరెడ్డి మద్దతు పలికారు. పట్నం మహేందర్ రెడ్డికి అవమానం జరిగిందని.. ఎమ్మెల్యే కంటే ఎమ్మెల్సీ ప్రోటోకాల్ ఎక్కువ అని పేర్కన్నారు. రాష్ట్రంలో పోలీసులు ఉన్నారా..? డీజీపీ... ఉన్నా లేనట్టే పోలీసుల రాజ్యం తయారైంది. పోలీసులు నిబంధనలు పాటిస్తున్నారా? ఎమ్మెల్యేకి ఐదు ఎస్కార్ట్ వాహనాలు అవసరమా..? పోలీసులు వీటి మీద స్పందించాలి. పట్నం మహేందర్ బూతులు తిట్టడం తప్పేనని అంటూ.. పోలీసుల పద్ధతి కూడా మారాలని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో శుక్రవారం జరిగే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కార్యక్రమానికి తాను హాజరుకావడం లేదని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గంలో కేంద్రమంత్రి గడ్కరీ అభివృద్ధి కార్యక్రమాలు ఉండడం వల్ల రేవంత్ కార్యక్రమానికి వెళ్లడం లేదని తెలిపారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పటిష్టంగా ఉందని వేరే నేత వచ్చి సమీక్ష జరపాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ వీక్‌గా ఉన్న దగ్గర సమావేశాలు పెట్టుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. పీకే గురించి కాదని.. కేసీఆర్‌ని ఎలా పీకాలన్నదే తమ టార్గెట్ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు సర్వ సాధారణమని చెప్పుకొచ్చారు. పార్టీ మారే ఉద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇచ్చే అంశంపై అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూసి కార్యాచరణ ప్రకటిస్తానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టి పాదయాత్రపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కష్టమైనా నష్టమైనా పాదయాత్రను కొనసాగించాలని భట్టిని కోరారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని భట్టికి సూచన చేశారు. రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు భట్టి విక్రమార్కకు అనుమతి ఇవ్వాలని సోనియా, రాహుల్‌కు లేఖ రాయనున్నట్లు తెలిపారు. 2004లో సీఎల్పీ నేతగా రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎంపీ గుర్తుచేశారు. భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తే కావాల్సిన సహకారం సీనియర్లం అందిస్తామన్నారు. రాహుల్ సభకు ఒక వ్యక్తి మాత్రమే లక్షల మందిని ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. మెడిసిన్ విద్యార్థిని తాళ్లపల్లి అనుషకు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. అనుషను దత్తత తీసుకుంటున్నాని - చదువు అంతా తానే చూసుకుంటానని స్పష్టం చేశారు. డాక్టర్ సీటు వచ్చింది కానీ చదివే స్తోమత లేదని... డబ్బుల కోసం ఉపాధిహామీ కూలీ చేసుకుంటుందని తెలిపారు. అనుషకు కావాల్సిన నిధులు, చదువు పూర్తి అయ్యే వరకు తనదే బాధ్యత అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యను మూలకు పడేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అని నాలుగు కట్టడాలు చూపించి అభివృద్ధి అంటున్నారన్నారు. ముఖ్యమంత్రికి కనీస జ్ఞానం ఉండాలని -తెలంగాణ అభివృద్ధి అని దేశాన్ని అభివృద్ధి చేస్తా అంటున్నారని విమర్శించారు. నిన్నటి ముఖ్యమంత్రి ప్రసంగం చూశానని... ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి పెట్టాలని సూచించారు. కోట్లు పెట్టినా దొరకని వైద్యసీటు కూలి పనిచేసుకుంటూ అనూషా సీటు సాధించిందని కొనియాడారు. 6 వేల స్కూల్స్ మూతపడ్డాయని.. తెలుగు మీడియంకు దిక్కులేదని.. ఇప్పుడు ఇంగ్లీషు మీడియం అంటున్నారని ఎంపీ కోమడిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు.

## నల్లగొండకు సిఎం వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి..) దశదిన కర్మలో పాల్గొనేందుకు సీఎం గురువారం నార్కట్‌పల్లికి చేరుకున్నారు. అనంతరం జిల్లాకు చెందిన విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ మందాడి సైదిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ రమణాచారి తదితరులతో కలసి నుడా పై సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రం ప్రవేశంలో ఉన్న మర్రిగూడ బైపాస్ రోడ్ పై ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతే గాకుండా నల్లగొండ నడిబొడ్డున ఉన్న పెద్ద గడియారం సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహం స్థానంలోనే అధునాతన సౌకర్యాలతో నాలుగు అంతస్థుల ఆర్ అండ్‌బీ వసతి గృహం నిర్మిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దానికి తోడు నల్లగొండ-నాగార్జున సాగర్ రహదారిపై ఉన్న ఎస్‌ఎల్‌బీసీ కార్యాలయ ప్రాంగణంలో చీఫ్ ఇంజినీర్ కార్యాలయం నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. కాగా, సీఎం కేసీఆర్ ప్రకటనలతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### 29న ప్రభుత్వ ఇఫ్తార్ విందు

(మొదటి పేజీ తరువాయి..) తెలిపారు. ఇఫ్తార్ విందుకు వచ్చే ప్రతినిధులకు ప్రత్యేక పాస్ లను జారీ చేసినట్టు తెలిపారు. రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు ప్రభుత్వం తరపున దుస్తులను కూడా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. ఎల్బీస్టేడియంలో జరిగే ఇఫ్తార్ విందుకుముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని అన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

## సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**పరిగి, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలో పరిగి ఎంపీపీ అరవింద్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సంధ్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్పంచ్ లకు ఇబ్బంది లేకుండా కేసిఆర్ ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా నల్ల నీటిని అందిస్తున్నాం అన్నారు. ప్రతి గ్రామంలో చెట్లు, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, ట్రాక్టర్, రోడ్లు, అన్ని సదుపాయలు కల్పిస్తున్నామన్నారు. భారత దేశంలో సంసద్ ఆదర్శ్ గ్రామీణ యోజన ద్వారా ఆదర్శ గ్రామ పంచాయతీల ఎంపికలో 10 గ్రామ పంచాయతీ లలో పదింటికి పది తెలంగాణ కు రావడం గర్వకారణం అని, ఇది కేసీఆర్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, వివిధ శాఖల అదికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన మెదక్ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు మసన్నగారి నాగరాజు



**అల్లదుర్గ్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** అల్లదుర్గ్ మండలం ఏఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు మసన్నగారి నాగరాజు, జిల్లా నాయకుడు ఈశ్వర్, అల్లదుర్గ్ మండల నాయకుడు మొగులయ్య, టేక్మాల్ మండల నాయకుడు యాదగిరి, నగబుష్ణం, పాపన్న పెట్ మండల నాయకుడు యాదగిరి పాల్గొన్నారు.

## ఐకెపి వివోఎలా ఉద్యోగులుగా గుర్తించాలి: విద్యాసాగర్



**అందోల్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** అందోల్ గ్రామంలో ఐకెపి వివోఎ ల సమస్యలు పరిష్కరించి కనీస వేతనం అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని గురువారం మూడు రోజులు నల్ల బ్యాడ్జీలతో రిలే నిరాహార దీక్ష చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల్లో గ్రామాభివృద్ధి లో మహిళా సంఘాల అభివృద్ధికి మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి ఏమాత్రం పట్టించుకోవడం లేదు గతంలో ముఖ్యమంత్రి తెలంగాణ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వ్యవస్థ రద్దు చేస్తానని చెప్పి అందరినీ నమ్మి నిలువునా మోసం చేస్తున్నారని అన్నారు. నెలకు ఐదు వేల రూపాయలు ఇస్తానని చెప్పి మూడు మూడు వేల రూపాయలు ఇస్తానని చెప్పి పెడుతున్నారు ఇది చాలా దుర్మార్గం తక్షణమే తూర్పునుండి ఐడి కార్డులు ఇవ్వాలి అందుకు ప్రతి నెల రెగ్యులరైజ్ వ్యక్తిగత ఖాతా ద్వారా ఇవ్వాలని తో సంబంధం లేకుండా వేల రూపాయలు సరిపెడుతున్నారు ఇది చాలా దుర్మార్గం ఐడి కార్డులు ఇవ్వాలని రెగ్యులర్ రెగ్యులర్ గా వేతనాలు వ్యక్తిగత ఖాతా ద్వారా ఇవ్వాలని వేతనాలు గ్రేడింగ్ తో సంబంధం లేకుండా చెల్లించాలని అర్హులైన వివో ఏ లకు ప్రమోషన్ ఇవ్వాలని శ్రీనిధి వివో ఖాతాలకు ఇవ్వాలని రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం స్పందించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో వివో ల సంఘము మండల అధ్యక్షులు మల్లయ్య ,ఆంజనేయులు సునీత, లక్ష్మారెడ్డి ,అశోక్ తదితరులు పాల్గొన్నారు

## ఏటీఎంలో నగదు చోరీకి యత్నం



**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లాలో బుధవారం ఏటీఎంలో నగదు చోరీ గుర్తుతెలియని ముగ్గురు యువకులు నిర్మించారు కానీ అంతలోనే అక్కడి నుండి పరారయ్యాడు ఈ నాడు కథనం ప్రకారం సంగారెడ్డి మండలం హెచ్డిఎఫ్సి బ్యాంకులో చోరీకి యత్నం జరిగిందని సంబంధిత బ్యాంకు సర్వీస్ ఇంజనీర్ రాజారామ్ గ్రామీణ ప్రాణాలు ఫిర్యాదు చేశారు ఈ మేరకు సంఘటన స్థలానికి గ్రామీణ పోలీసులు వెళ్లి విచారించారు ఏటీఎం కేంద్రంలో సమీపంలో సీసీ కెమెరాల రికార్డులో చోరీకి ప్రయత్నం చేసినట్లుగా నిక్షిప్త మైంది. సీసీ ఫుటేజ్ ఆధారంగా కంది మండలం బ్యాతోల్ గ్రామానికి చెందిన మంగలి నరేష్ (23) కాడి గల్ల సంగమేశ్వర్(22) కమ్మరి వీరేశం(27)లుగా గుర్తించారు. వారిని అదే గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు నేరం జరిగిన 12 గంటల లోపు కేసును ఛేదించడం పై శివలింగం ఎస్సై శ్రీనివాస్ రెడ్డి డిఎస్పీ అభినందించారు.

## విజయ ప్రభావతికి ఘన సన్మానం



**నాగార్జునసాగర్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** నాగార్జునసాగర్ హిల్ కాలనీ లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 18 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉప్పలపాటి విజయ ప్రభావతిని గురువారం నాడు జె ఎం జె పాఠశాల నిర్వహణ సంస్థ మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మాజీ మండల విద్యాశాఖ అధికారి వెంకటరామ శర్మ మాట్లాడుతూ విజయ ప్రభావతి క్రమశిక్షణతో ఆధ్యాత్మిక చింతనతో మంచి వ్యక్తిత్వంతో 18 సంవత్సరాల పాటు విద్యారంగంలో సేవలు అందించారన్నారు .ఇటీవలే డాక్టరేట్ పొంది ఎంత మంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్ఫూర్తిగా మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య బృందం సిస్టర్ జోస్మిన్, సిస్టర్ షీన్, సిస్టర్ క్లారా, ఉపాధ్యాయ బృందం హనుమ కుమార్ ,శివ కుమార్, నాగార్జున, కృష్ణ, కిరణ్ కుమార్ , పాహిమబేగం ,జానకి, మరియకుమారి, షమీమ్ ,ప్రవీణ ,మల్లీశ్వరి , శిరీష ,సైదమ్మ ,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ముదిరాజ్ ఆధ్వర్యంలో గంగమ్మ బోనాల ఊరేగింపు మూడు రోజుల ఉత్సవాలు



**పాపన్నపేట, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** పాపన్నపేట మండలం అర్కేల గ్రామంలో అంగరంగ వైభవంగా బోనాల ఊరేగింపు వైభవంగా ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో గంగమ్మ బోనాల ఊరేగింపు మూడు రోజుల ఉత్సవాలు జరుగుతాయని గ్రామ సర్పంచ్ కవిత రవీందర్, గంగమ్మ గుడి అధ్యక్షుడు బుచ్చా నర్సింలు, మాజీ సర్పంచ్ పుల్లయ్య ,ఎల్లంపల్లి మల్లేశం బుచ్చా సాయిలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పై ఆరోపణలు సరి కాదు

### మొగుళ్ళ భద్రయ్యను బిసి సంఘం నుండి తీన్మార్ టీమ్ నుండి సస్పెండ్ చేయాలి

### రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్



**ములుగు, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** ములుగు జిల్లా కేంద్రంలోని ములుగు జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పై చేస్తున్న ఆరోపణలు సరి కాదని ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్థి కుమార్ గాడ్గే అన్నారు ములుగు జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో గురువారం ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో చాపర్తి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగస్తురాలు సామాజిక ఉద్యమాల ఆడబిడ్డ సామాజిక సేవకురాలు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని డిమాండ్ చేశారు కరోనా కష్ట కాలంలో నిరుపేదల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు అలాంటి ములుగు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా పై బిసి సంఘం ముసుగులో తీన్మార్ మల్లన్న టీమ్ లో పని చేస్తూ మొగుళ్ళ భద్రయ్య అనే వ్యక్తి జీర్ణించుకోలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు కమ్యూనిస్ట్ ఉద్యమాల పోరాట యోధుడు మహ్మద్ సర్వర్ ఉద్యమాల వారసురాలు తస్లీమా పై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు అలాగే కొందరు స్వార్థ పరులు తప్పుడు వార్తలు సృష్టిస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్న వారిని అవమానాలు పరుస్తున్న ఇలాంటి దుష్ట శక్తులను ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని కోరారు పేద ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను సామాజిక సేవకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజా సంఘాల మీద ప్రజల మీద ఉన్నదని అన్నారు ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే రాష్ట్ర అధ్యక్షులు కేడళ ప్రసాద్ ఇంటి పార్టీ ఉద్యమకారులు కొమురన్న ప్రజా సంఘాల నాయకులు శనిగరపు నరేష్ చింతనిప్పుల బిక్షపతి బోడ రాజు నక్క రాజు సిపిఐ పార్టీ జిల్లా నాయకులు చిక్కుల వెంకటేష్ విశ్వనాథ్ కొట్టెపాక శ్రీనివాస్ కే నరేష్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



**ములుగు, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం లో బండి నరసయ్య అధ్యక్షతన జరిగిన ఏఐటియుసి జిల్లా కమిటీ సమావేశంలో మేడే వాల్ పోస్టర్ లను ఆవిష్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ చికాగో నగరంలో 8 గంటల పనిదినాల కోసం జరిగిన పోరాటంలో అనేకమంది అసువులు బాశారు అన్నారు ఆ నెత్తురులో ఉద్భవించినదే మేడే జెండా అన్నారు ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కోవడానికి కార్మిక వర్గం అంకిత భావంతో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు ఎనిమిది గంటల పని దినాలు ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు కార్పోరేట్ సంస్థల ఆదాయంపై సీలింగ్ విధించాలని కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కనీస వేతన జీవో లను తక్షణమే అమలు చేయాలని అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ చట్టం తేవాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే ఎల్ఐసి బ్యాంకింగ్ తదితర రంగాలను అమ్మే పనిలో పడడం దౌర్భాగ్యం అని అన్నారు అందుకే అవన్నీ రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం మేడే స్ఫూర్తితో సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిక్కుల వెంకటేష్ సామల రమ గుణ్ణాల రాజకుమారి తోట సంపత్ ఎండి నాసర్ మాడిశెట్టి భాగ్య తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

### అందించిన బహుజన సమాజ్ పార్టీ జిల్లా నాయకులు



**ములుగు, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** గోవిందరవుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో పసులది భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి దశదిన కర్మ కార్యక్రమనికి బహుజన్ సమాజ్ పార్టీ ములుగు జిల్లా నాయకులు శనిగరపు నరేష్ కుమార్ జిల్లా కోశాధికారి కాల్వల నరేష్ గారు వారి వారి కుటుంబాన్ని పరామర్శించారు అదేవిదంగా నిరుపేద అయిన వారి కుటుంబానికి అన్ని విధాలుగా భరోసా ఉంటామని కుటుంబంలో ఇంటి పెద్దను కొల్పవడం ఏ కుటుంబానికి అయిన తిరనిలోటుఅని తెలియజేస్తూ ఆర్థిక సాయంగా 2000/- రూపాయలు ఆ కుటుంబానికి ఇస్తూ భద్రయ్య ఇద్దరు కూతుర్లు ఉన్నత చదువులు చదువుతున్న నేపథ్యంలో వారికి ఏ ఆర్థిక ఇబ్బందులు ఉన్న కచ్చితంగా బహుజన్ సమాజ్ పార్టీ ములుగు జిల్లా నాయకులు అందరూ అండగా ఉంటారని మీకు ఏ సమస్య వచ్చిన ఆర్థికంగా మరియు విద్య పరమైన ఏదైనా సరే ఫోన్ చెయ్యండి మా నుండి కచ్చితంగా సాయం ఉంటుంది అని ఆ కుటుంబానికి భరోసా ఇవ్వడం జరిగింది కష్టం వచ్చినా ప్రతి కుటుంబానికి బహుజన్ సమాజ్ పార్టీ అండగా ఉంటుంది ఈ సందర్భంగా నరేష్ కుమార్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పసులది ముఖేష్ మండల కన్వీనర్ డొంక చిన్ని కోగిల అజయ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఏటూరునాగారం బస్ డిపో సాధనకై ఉద్యమించాలి



**ములుగు, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** ఏటూరునాగారం మండల కేంద్రంలో బస్ డిపో సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి బి ఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం రోజు మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపాల శివ గారి అధ్యక్షతన అన్ని కులసంఘాల నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజి ఎంపీపీ జాడి రామరాజు నేత మాట్లాడుతూ ఏటూరునాగారం బస్ డిపో సాధనకోసం ఏటూరునాగారం లో మండలం లోని రాజకీయాలకు అతీతంగా బస్ డిపో సాధనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఏటూరునాగారం బస్ డిపో 1983 నుండి గత 39సంత్సరాలనుడి రాజకీయ నాయకులు ఎన్నికలు వచ్చినపుడు మేము గెలిస్తే బస్ డిపో పూర్తి చేస్తాం అని చెపుతూ వెళుతున్నారు గెలిచాక చేసేవారు లేరు అని అన్నారు తెలుగుదేశం ప్రభుత్వ అయం లో బస్ డిపో కట్టినారు గానీ గత 25 సంత్సరలనుండి పటించుకొనేవారే లేరు అని అన్నారు బస్ డిపో ఎవరు పటించుకొనేవరు లేక డిపో శిథిల వ్యవస్థకు వచ్చింది 2017లో అప్పటి గిరిజనశాఖామంత్రి అజ్మీరా చందూలాల్ గారు కోటి రూపాయలు మంజూరు చేస్తే బస్ డిపో కి వినియోగించకుండా ఆ నిధులను అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ నాయకులు పటించుకొకపోవడం వలనే ఆ నిధులు బస్ డిపో కి వినియోగించ లేదు అని జాడి రామరాజు నేత అన్నారు ఏటూరునాగారం బస్ డిపో అయితే మూడు రాష్ట్రాలకు కేంద్ర బిందువు అవుతుందని అన్నారు ఆర్టీసీ అధికారులు పట్టించుకోని బస్ డిపో పునర్నిర్మాణం చేయాలని అన్నారు ఇదే సమావేశంలో ఏటూరునాగారం లో రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ను కోరడం జరిగింది ఈ సమావేశంలో ఆర్టీసీ డిపో సాధన సమితి అడ్వక్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది కమిటీ కన్వీనర్ గా వావిలాల స్వామి ని ఎన్నుకోవడం జరిగింది కమిటీ సభ్యులుగా పెంట్యాల ప్రభాకర్ పొడం శోబాన్ ఎండీ సులేమాన్ ఈసం యాధన్న గజాల శంకర్ నీ ఎన్నుకోవడం జరిగింది ఈ సమావేశంలో చిటమోటా రఘు రాష్ట్ర నాయకుడు తిపనపల్లి సుధర్శన్ పరికి శ్రీనివాస్ వావిలాల సాంబశివరావు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ పరికి ప్రసాద్ చెన్న గణపతి వల్సా తిరుపతితదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణలో మరో ఉద్యోగ నోటిఫికేషన్

### ఎక్సైజ్, రవాణా శాఖలో 677 ఉద్యోగాల భర్తీ

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** రాష్ట్రంలోని ఉద్యోగార్థులకు ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. తెలంగాణ సర్కార్ వరుసగా నోటిఫికేషన్‌లను విడుదల చేస్తోంది. ఇప్పటికే పోలీస్ శాఖలో ఉద్యోగాల భర్తీ, గ్రూప్-1 నోటిఫికేషన్‌ను ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు మరో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తాజాగా ఎక్సైజ్, రవాణా శాఖలో 677 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇందులో.. ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్(హెచ్‌వో) 6 పోస్టులు, ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్(ఎల్‌సీ) 57 పోస్టులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల 614కు నోటిఫికేషన్ వెలువడింది. అర్హులైన అభ్యర్థుల నుంచి మే 2 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి మే 2 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు.మొత్తం 16,614 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసిన విషయం విదితమే. ఇందులో 16,027 కానిస్టేబుల్ ఉద్యోగాలు కాగా, మిగతా 587 ఎస్‌ఐ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మొత్తం 503 గ్రూప్-1 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటిఫికేషన్ ద్వారా 18 శాఖలకు చెందిన పోస్టులను భర్తీ చేయనున్నట్టు కమిషన్ వర్గాలు వెల్లడించాయి. ఇందులో డిప్యూటీ కలెక్టర్ పోస్టులు 42, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు-91, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్-48, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 పోస్టులు-41, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్-38, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్-40, ఎంపీడీవో పోస్టులు-121తో పాటు మరికొన్ని పోస్టులు ఉన్నాయి.

## సిఎస్ సోమేశ్‌తో క్రషర్స్ ప్రతినిధుల భేటీ

### సమస్యలపై సిఎస్‌కు వివరణ



**హైదరాబాద్, ఏప్రిల్ 28 (అక్షర వెలుగు):** తెలంగాణ క్రషర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం బి. ఆర్. కె.ఆర్. భవన్ లో ప్రభుత్వప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు.క్రషర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు. ఇటీవల కాలంలో భవన నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా సిమెంట్, ఇసుక ధరలుపెరిగిన నేపథ్యంలో క్రషర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎస్ ను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రోనాల్డ్ రోస్, మైన్స్, జియాలజీ జాయింట్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) వెంకటేశ్వర్లు, మైన్స్ , జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ స్వామి కృష్ణారావు, మైన్స్,జియాలజీ కన్సల్టెంట్ నిరంజన్, అసోసియేషన్ సభ్యులు కమలాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నందరెడ్డి, పి.ఎం. కుమార్, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.




# చలన చిత్రం

## అది ఎప్పటికి తీరుతుందో చూడాలి



'ఉప్పెన', 'శ్యామ్ సింగరాయ్', 'బంగర్రాజు' వంటి సూపర్ హిట్ చిత్రాలతో టాలీవుడ్‌లోకి దూసుకొచ్చింది అందాల తార కృతి శెట్టి. చూస్తుండగానే అగ్ర నాయికగా పేరు తెచ్చుకుంది. తొలి సినిమా లాక్ డౌన్ భయాలనూ ఎదుర్కొని ఘన విజయాన్ని సాధించింది. దీంతో అరంగేట్రంతోనే వెనుదిరిగి చూడాల్సిన పనిలేకుండా పోయిందీ భామకు. పరస్పరం భిన్నమైన క్యారెక్టర్‌లు లభించడం వల్లే తను నాయికగా పేరు తెచ్చుకున్నానని అంటున్నదీ తార. కృతి శెట్టి మాట్లాడుతూ 'నేను ఇప్పటిదాకా చేసిన చిత్రాలన్నింటిలో వేటికవి భిన్నమైన క్యారెక్టర్స్ లభించాయి.దీంతో ప్రేక్షకులకు నేను ప్రతిసారీ కొత్తగా కనిపిస్తున్నా. దగ్గరకొచ్చే కథల్లో గత చిత్రాలను పోలినవి, మూసగా అనిపించినవి వద్దని చెప్పేస్తా. నటిగా సవాలు విసిరే సినిమాల్లో నటించాలని ఉంది. త్వరలో సొంత డబ్బింగ్ చెప్పుకోవాలనీ ప్రయత్నిస్తున్నా. రాకుమారి పాత్రలో నటించాలన్నది నా కోరిక. అది ఎప్పటికి తీరుతుందో చూడాలి' అని చెప్పింది. ప్రస్తుతం కృతి శెట్టి సుధీర్ బాబుతో కలిసి 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి', నితిన్‌తో 'మాచర్ల నియోజకవర్గం', రామ్ సరసన 'ద వారియర్' చిత్రాల్లో నటిస్తున్నది.



## మేకప్ ఆర్టిస్ట్‌గా మారిన బాలీవుడ్ స్టార్, ఎవరికోసమో తెలుసా?

బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ మేకప్‌మెన్‌గా మారిపోయాడు. ఎందుకు? ఎవరికోసం? అనుకుంటున్నారా? తన ముద్దుల కూతురు ఇరా కోసం! ఈ విషయాన్ని స్వయంగా ఇరానే వెల్లడించింది. 'నాకు మేకప్ ఎవరు వేశారో తెలుసా? ఇంకెవరు మా నాన్నే. నాకంటే బాగా మేకప్ వేస్తానని చెప్పాడు. చివరకు ఆ మాటను నిజం చేసి చూపించాడు. ఎవరికైనా యూట్యూబ్ ట్యుటోరియల్స్ కావాలా?' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో తండ్రితో దిగిన ఫొటోలను పోస్ట్ చేసింది.ఆమిర్ తన ముఖానికి మేకప్ వేస్తే ఇరా మాత్రం ఆమిర్ తలకు హెయిర్ బ్యాండ్ పెట్టి నవ్వేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. వీరి అనుబంధాన్ని చూసిన ఫ్యాన్స్ ఆమిర్ ఉత్తమ తండ్రి, లవ్ యూ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆమిర్ నటించిన తాజా చిత్రం 'లాల్‌సింగ్ చద్దా'. ఫారెస్ట్ గంప్‌కు రీమేక్‌గా తెరకెక్కిన ఈ మూవీలో కరీనా కపూర్, నాగచైత్య, అద్వైత్ చందన్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు.





## "ఆచార్య" పాన్ ఇండియా రిలీజ్ అందుకే లేదు:కొరటాల క్లారిటీ

ప్రస్తుతం పాన్ ఇండియా లెవెల్లో మన తెలుగు సినిమాలు ఏ స్థాయిలో రాణిస్తున్నాయో చూస్తూనే ఉన్నాము. ఒకదాన్ని మించి మరొక సినిమా వెళ్లి పాన్ ఇండియా లెవెల్లో అదరగొడుతున్నాయి. మరి అందులో భాగంగా చాలా వరకు సినిమాలు మొదట తెలుగులోనే ప్లాన్ చేసి స్టార్ట్ చెయ్యగా తర్వాత తర్వాత అవి పాన్ ఇండియా రిలీజ్ గా మారినవి కూడా ఉన్నాయి.మరి ఇదిలా ఉండగా లేటెస్ట్ భారీ సినిమా "ఆచార్య" పై కూడా పాన్ ఇండియా రిలీజ్ మాటలు వినిపించాయి. అయితే వీటిపై దర్శకుడు కొరటాల శివ ఒక క్లుప్తమైన క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాని మొదటి నుంచి తెలుగుకి సంబంధించిన సినిమాగానే తియ్యాలి అనుకున్నామని కానీ తర్వాత సమీకరణాలు మారడంతో పాన్ ఇండియా రిలీజ్ చర్చలు అయితే వచ్చాయి.అది నిజమే కానీ తర్వాత మళ్ళీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో కాస్త గజిబిజి క్రేజ్ ని క్యాష్ చేసుకోవాల్సిన అవసరం లేదనే ఉద్దేశంలో ఇప్పుడే పాన్ ఇండియా రిలీజ్ పని లేదని భావించి వద్దనుకున్నాం అని తెలిపారు. మరి ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి మరియు మెగాపవర్ రామ్ చరణ్ లు హీరోలుగా నటించగా ఏప్రిల్ 29న భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ అవుతుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com